జూనియర్ కోహ్లీ.. అకాయ్

కోహ్లీ, అనుష్క దంపతులకు బాబు

న్యూఢిల్లీ: టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ రెండోసారి తండ్రయ్యాడు. కోహ్లీ, అనుష్క దంపతులకు ఈ నెల 15న పండంటి మగబిడ్డ పుట్టాడు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా విరుష్క జోడీ మంగళవారం ప్రకటించింది. ఈ జంటకు 2021లో ఓ పాప (వామిక) జన్మించగా.. ఇప్పుడు బాబుకు 'అకాయ్' అని నామకరణం చేసినట్లు వెల్లడించింది. ఇలాంటి సమయాల్లో అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపిన విరుష్క జోడీ.. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించవద్దని విజ్ఞప్తి చేసింది. ప్రస్తుతం భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ జరుగుతుండగా.. ఈ కారణంగానే కోహ్లీ జట్టుకు దూరమైన విషయం తెలిసిందే.

నిహార్ పతక జోరు

ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: గువాహటి వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ సాయి నిహార్ బిక్కిన పతక జోరు కనబరిచాడు. మంగళవారం జరిగిన పురుషుల 200మీటర్ల మెడ్లే ఈవెంట్‌లో బరిలోకి దిగిన నిహార్(కేఎల్‌ఈఎఫ్ యూనివర్సిటీ) 2:12:88సెకన్ల టైమింగ్‌తో టాప్‌లో నిలిచి స్వర్ణం ఖాతాలో వేసుకున్నాడు. ఉత్సబ్ దత్తా (వెస్ట్‌బెంగాల్ యూనివర్సిటీ), మణికంఠ (జైన్ యూనివర్సిటీ) వరుసగా రజత, కాంస్య పతకాలు దక్కించుకున్నారు. అదే జోరు కొనసాగిస్తూ 200మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ విభాగంలో 2:12:90సెకన్ల టైమింగ్‌తో రెండో స్థానంలో నిలిచి రజతం సొంతం చేసుకున్నాడు. ఇదే విభాగంలో సుభాశిష్ డే, ఆర్యన్ భోంస్లే రజత, కాంస్యాలు కైవసం చేసుకున్నారు.

నేటి నుంచి వూటీ గోల్ఫ్‌టోర్నీ

ప్రైజ్‌మనీ కోటి రూపాయలు

మణికొండ, ఫిబ్రవరి 20: వికారాబాద్ వేదికగా ఈ నెల 21నుంచి 24వ తేదీ వరకు వూటీ గోల్ఫ్ కౌంటీ జరుగబోతున్నది. ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఆఫ్ ఇండియా (పీజీటీఐ)లో భాగంగా డ్రీమ్‌వ్యాలీ గ్రూపు సహకారంతో వూటీ మాస్టర్స్ టోర్నీ నిర్వహిస్తున్నారు. ఇందులో భారత టాప్ గోల్ఫర్లుగా పేరొందిన మను గాందాస్, అమన్‌రాజ్, కరణ్‌ప్రతాప్‌సింగ్, రాహిల్ గాంజీ, ఉదయన్ మానె బరిలోకి దిగుతున్నారు. వీరికి తోడు శ్రీలంకకు చెందిన తంగరాజా, ప్రభాకరన్, జమాల్ హుస్సేన్, బాదల్ హుస్సేన్ (బంగ్లాదేశ్), కెవిన్ ఎస్టావె, సుకుర బహదూర్‌రాయ్ (నేపాల్), మతియాస్ డోమినెజ్ సుభాశ్ తమంగ్ లాంటి గోల్ఫర్లు పోటీకి సై అంటున్నారు. టోర్నీ ప్రైజ్‌మనీ రూ.కోటి ప్రకటిస్తున్నట్లు డ్రీమ్‌వ్యాలీ గ్రూపు ఎండీ సంతోష్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు.

చాంప్ హైదరాబాద్

మేఘాలయపై 5 వికెట్లతో గెలుపు | **రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ ఫైనల్లో ఘన విజయం**

దేశవాళీ ప్రతిష్ఠాత్మక టోర్నీ రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ అదరగొట్టింది. చిన్న జట్ల మధ్య పెద్దన్నలా.. పూర్తి ఆధిపత్యంతో ప్లేట్ గ్రూప్ విజేతగా నిలిచింది. లీగ్ దశలో ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లోనూ బోనస్ పాయింట్లు సాధించిన హైదరాబాద్.. ఫైనల్లోనూ సత్తాచాటింది. కెప్టెన్ తిలక్ వర్మ, రాహుల్ సింగ్ రాణించడంతో అలవోకగా లక్ష్యాన్ని ఛేదించి.. వచ్చే ఏడాది ఎలైట్ గ్రూప్‌కు అర్హత సాధించింది.

హైదరాబాద్, ఆట ప్రతినిధి: సీజన్‌లో నిలకడగా రాణించిన హైదరాబాద్ జట్టు రంజీ ట్రోఫీ ప్లేట్ గ్రూప్ విజేతగా నిలిచింది. ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంర్జాతీయ స్టేడియంలో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో మేఘాలయను చిత్తుచేసింది. గ్రూప్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో గెలిచిన మన జట్టు.. అజేయంగా ప్లేట్ లీగ్‌ను ముగించింది. 198 పరుగుల లక్ష్యఛేదనలో ఓవర్‌నైట్ స్కోరు 71/1తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన హైదరాబాద్ చివరకు 5 వికెట్లు కోల్పోయి 203 పరుగులు చేసింది. కెప్టెన్ తిలక్ వర్మ (64; 6 ఫోర్లు, 2 సిక్సర్లు), రాహుల్ సింగ్ (62; 8 ఫోర్లు, 2 సిక్సర్లు) అర్ధశతకాలతో రాణించారు. అంతకుముందు మేఘాలయ తొలి ఇన్నింగ్స్‌లో 304 పరుగులు చేయగా.. హైదరాబాద్ 350 రన్స్ కొట్టింది. రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 243 పరుగులు కొట్టింది. రెండు ఇన్నింగ్స్‌ల్లో కలిపి తనయ్ త్యాగరాజన్ 10 వికెట్లు పడగొట్టగా.. తొలి ఇన్నింగ్స్‌లో భారీ సెంచరీ చేసిన నితీశ్ రెడ్డికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఈ ఏడాది ప్రదర్శనతో హైదరాబాద్ జట్టు.. వచ్చే సీజన్ రంజీ ట్రోఫీకి ఎలైట్ గ్రూప్‌లో చోటు దక్కించుకోనుంది. విజేతగా నిలిచిన హైదరాబాద్‌కు హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు రూ.10 లక్షల నజరానా ప్రకటించారు. దీనికి తోడు కెప్టెన్ తిలక్ వర్మ, తన్మయ్, తనయ్, నితీశ్, ప్రజ్ఞయ్‌కు 50వేల ప్రత్యేక బహుమతి అందజేశారు.

ప్లేట్ గ్రూప్ బాద్‌షా

నిరుడు పేలవ ప్రదర్శన కారణంగా.. ప్లేట్ గ్రూప్‌కు పడిపోయిన హైదరాబాద్.. ఈసారి ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టింది. అరుణాచల్‌ప్రదేశ్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్, సిక్కింతో కలిసి ప్లేట్ గ్రూప్‌లో పోటీ పడిన హైదరాబాద్.. గ్రూప్ దశలో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఇన్నింగ్స్ తేడాతో విజయాలు సాధించింది. నాగాలాండ్‌తో జరిగిన తొలి పోరులో కెప్టెన్ తిలక్ వర్మ సెంచరీ, రాహుల్ డబుల్ సెంచరీతో కదంతొక్కడంతో.. హైదరాబాద్ 474/5 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. ఆ తర్వాత నాగాలాండ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో వరుసగా 153, 127 పరుగులకు ఆలౌటైంది. మేఘాలయతో జరిగిన రెండో మ్యాచ్‌కు తిలక్ అందుబాటులో లేకపోగా.. రోహిత్ రాయుడు అజేయంగా 124 రన్స్ కొట్టడంతో మన జట్టు 346/7 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. ప్రత్యర్థి రెండు ఇన్నింగ్స్‌ల్లో 111, 154 పరుగులే చేశాయి. సిక్కింతో జరిగిన మూడో మ్యాచ్‌లో తిలక్ (103), తన్మయ్ (137) రాణించడంతో మన టీమ్ 463/4 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. ప్రత్యర్థి 79, 186 పరుగులకే కుప్పకూలింది. అరుణాచల్‌తో జరిగిన పోరులో తన్మయ్ అగర్వాల్ (181 బంతుల్లో 366; 34 ఫోర్లు, 26 సిక్సర్లు) పాస్టెస్ట్ ట్రిపుల్ సెంచరీతో కదంతొక్కడంతో.. హైదరాబాద్ 615/4 వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. ప్రత్యర్థి 172, 256 రన్స్‌కు పరిమితమైంది. ఆఖరి లీగ్ మ్యాచ్‌లో రాహుల్ సింగ్ (108), నితీశ్ రెడ్డి (115) సెంచరీలు బాదడంతో మన జట్టు 465/9 వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేయగా.. మిజోరాం 199, 193 రన్స్‌కు పరిమితమైంది. ఇలా లీగ్‌దశలో ఆడిన అన్నీ మ్యాచ్‌ల్లో సంపూర్ణ ఆధిపత్యం కనబర్చిన హైదరాబాద్‌కు వచ్చే ఏడాది అసలు సిసలు సవాలు ఎదురు కానుంది. ప్లేట్ గ్రూప్ విజేతగా నిలిచిన అనంతరం హైదరాబాద్ కెప్టెన్ తిలక్ వర్మ మాట్లాడుతూ.. 'హైదరాబాద్ జట్టుకు రంజీ ట్రోఫీ అందించడమే నాలక్ష్యం. నిరుడు అనుభవం ఉన్న ఆటగాళ్లు అందుబాటులో లేక పోవడంతో.. ప్లేట్ గ్రూప్‌కు పరిమితం కావాల్సి వచ్చింది. ఈసారి మనవాళ్లందరూ మంచి ఫామ్ కనబర్చారు. ఎలైట్ గ్రూప్‌లోనూ ఇదే దూకుడు కొనసాగిస్తూ.. ట్రోఫీ చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తాం. ప్లేట్ నుంచి నేరుగా రంజీ ట్రోఫీ గెలువడం మామూలు విషయం కాదు. నాకు ఆటంటే అమితమైన ఇష్టం. రెడ్ బాల్, వైట్ బాల్ అనే తేడా లేదు. ఏ అవకాశం వస్తే దాన్ని వినియోగించుకుంటూ ముందుకు వెళ్లాలనుకుంటున్నా. అతి త్వరలోనే భారత టెస్టు జట్టులో చోటు దక్కించుకుంటాననే నమ్మకం ఉంది' అని పేర్కొన్నాడు.*

టైటిల్ గెలిస్తే.. బీఎండబ్ల్యూ కార్లు

హైదరాబాద్ క్రికెట్ టీమ్‌కు అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్‌రావు బంపర్ ఆఫర్ ప్రకటించాడు. రానున్న మూడు సీజన్లలో హైదరాబాద్ ఎలైట్ టైటిల్ గెలిస్తే జట్టులో ఒక్కో క్రికెటర్‌కు బీఎండబ్ల్యూ కార్లు బహుమతి ఇస్తామని ప్రకటించారు. దీనికి తోడు జట్టుకు కోటి రూపాయల నగదు ప్రోత్సాహం అందిస్తామని అన్నారు. ప్లేట్ నుంచి ఎలైట్‌కు చేరుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. వచ్చే సీజన్‌లో ఎలైట్ గ్రూపులో హైదరాబాద్ సత్తాచాటాలని జగన్ ఆకాంక్షించారు. ఇందుకు హెచ్‌సీఏ తరపున జట్టుకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సీఏ కోశాధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త స్కోర్లు

మేఘాలయ తొలి ఇన్నింగ్స్: 304; **హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్:** 350;**మేఘాలయ రెండో ఇన్నింగ్స్:** 243; **హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్:** 203/5 (తిలక్ 64, రాహుల్ 62; సంగ్మా 3/47).

మార్చి 22 నుంచి ఐపీఎల్!

న్యూఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ మార్చి 22 నుంచి ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. సాధారణంగా ప్రతి ఏటా వేసవిలో ఐపీఎల్ నిర్వహిస్తుండగా.. ఈసారి దేశ వ్యాప్తంగా సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఐపీఎల్ షెడ్యూల్ విడుదలపై తర్జన భర్జన కొనసాగుతున్నది. 'వచ్చే నెల 22 నుంచి టోర్నీ ప్రారంభించాలనుకుంటున్నాం. అయితే పూర్తి స్థాయిలో కాకుండా.. తొలుత 15 రోజుల షెడ్యూల్ విడుదల చేయాలనుకుంటున్నాం. లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తర్వాత దాన్ని గమనించి మిగిలిన మ్యాచ్‌లను ప్లాన్ చేస్తాం' అని ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్ మంగళవారం పేర్కొన్నాడు. గతంలో సాధారణ ఎన్నికల సమయంలో లీగ్‌ను విదేశాల్లో నిర్వహించగా.. ఈసారి అలా కాకుండా ఎన్నికలతో ఇబ్బంది లేకుండా షెడ్యూల్ రూపొందించి.. దేశంలోనే మొత్తం లీగ్ నిర్వహించాలని ఐపీఎల్ పాలక మండలి భావిస్తున్నది.

రాహుల్ ఔట్

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టుకు భారత్ జట్టు మరిన్ని మార్పులతో బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ పేసర్ బుమ్రా జట్టు నుంచి విడుదల కాగా, గాయం నుంచి పూర్తిగా కోలుకోని రాహుల్ నాలుగో టెస్టుకు దూరమయ్యాడు. ఈ నెల 23 నుంచి భారత్, ఇంగ్లండ్ మధ్య రాంచీలో నాలుగో టెస్టు మ్యాచ్ జరుగనుంది.

ప్రిక్వార్టర్స్‌లో నాగల్

పుణె: భారత యువ టెన్నిస్ ప్లేయర్లు సుమిత్ నాగల్, రామ్‌కుమార్ రామనాథన్.. ఏటీపీ చాలెంజర్-100 టోర్నీ ప్రిక్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లారు. పుణెలో జరుగుతున్న ఈ టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ నాగల్ 7-6 (8/6), 6-4తో యూ సియోంగ్ (చైనీస్ తైపీ)పై విజయం సాధించాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.